ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- గతేడాది తన పిలుపు మేరకు ప్రజలు బంగారం కొనుగోళ్లను తగ్గించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.

- ఐఐటీ (IIT) విద్యార్థులకు లభించే గుర్తింపు.. ఐటీఐ (ITI) విద్యార్థులకు కూడా దక్కాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు.

- పంచాయతీ ఎన్నికల అనంతరం కూడా గ్రామాల్లో ప్రశాంత పరిస్థితి ఉండే విధంగా ఎన్నికలు జరగాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సూచించారు.

- బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల మధ్య సినిమా రంగంలో మరింత బలమైన సహకారం అవసరమని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఎ.ఎస్. ప్రభాత్ పేర్కొన్నారు.

==========

గతేడాది తన పిలుపు మేరకు ప్రజలు బంగారం కొనుగోళ్లను తగ్గించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల పసిడి ధరలు తగ్గి, కొనుగోలుదారులకు ఆదా జరిగిందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగించారు. పశ్చిమాసియాలో ఘర్షణల కారణంగా ముడిచమురు ధరలు పెరిగి, విదేశీ మారకద్రవ్య నిల్వలపై ఒత్తిడి పడిన సమయంలో.. బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని తాను దేశ ప్రజలకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని ప్రధానమంత్రి గుర్తు చేశారు. ఈ సందర్భంగా పూర్వ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఇచ్చిన పిలుపును నరేంద్ర మోదీ ప్రస్తావించారు. దేశ ప్రయోజనాల కోసం వారానికి ఒక పూట భోజనం మానేయాలన్న శాస్త్రి పిలుపుకు అప్పట్లో ప్రజలు స్పందించినట్లే, నేడు కూడా దేశహితం కోసం ప్రజలు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు.

==========

పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు సూచించారు. అందరి ఆమోదంతో ఏకగ్రీవాలు జరిగితే వచ్చే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, పంచాయతీ ఎన్నికలు, ఏకగ్రీవాలపై మంత్రులు, ఇతర నాయకులతో ముఖ్యమంత్రి ఈరోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 5 వేల లోపు జనాభా ఉంటే 15 లక్షల రూపాయలు, 5-10 వేల మధ్య జనాభా ఉంటే 25 లక్షలు, 10 వేలపైన జనాభా ఉంటే 50 లక్షల రూపాయలు ఇచ్చే విషయాన్ని తెలియజేయాలన్నారు.

==========

వచ్చేనెల మొదటి వారంలో తిరుపతి జిల్లాలో నిర్వహించనున్న డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన ఈరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ తొలిసారిగా రాజధానికి వెలుపల ఏర్పాటు చేశారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

==========

బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల మధ్య సినిమా రంగంలో మరింత బలమైన సహకారం అవసరమని భారత్ పిలుపునిచ్చింది. గోవాలో జరుగుతున్న 57వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ)లో భాగంగా నిర్వహించిన బ్రిక్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఎ.ఎస్. ప్రభాత్ మాట్లాడారు. ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడంలో సినిమాకు ప్రత్యేక శక్తి ఉందన్నారు. ఇఫిలోని బ్రిక్స్ ఫిలిం ఫెస్టివల్ విభాగంలో సభ్య, భాగస్వామ్య దేశాల నుంచి 21 చిత్రాలు ప్రదర్శితమవుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యం, ఆదివాసీ గుర్తింపు, మహిళల హక్కులు, వలసలు, వాతావరణ మార్పులు, సామాజిక పరివర్తన వంటి విభిన్న అంశాలను ఈ చిత్రాలు ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు.

==========

ఐఐటీ (IIT) విద్యార్థులకు లభించే గౌరవం, గుర్తింపు.. ఐటీఐ (ITI) విద్యార్థులకు కూడా సమానంగా దక్కాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. నైపుణ్య ఆధారిత విద్య, వృత్తి విద్యకు సమాజంలో మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమం వేదికగా స్పందించిన ఆయన.. దీనిని ప్రస్తావించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక మార్పుల దిశగా వేగంగా అడుగులు వేస్తోందని, ఈ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, ఆచరణాత్మక నైపుణ్యాలు కలిగిన కార్మికులకు భవిష్యత్‌లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. పరిశ్రమలు, తయారీ రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం మరింత పెరగనుందని, వృత్తి విద్యకు సముచిత గుర్తింపు ఇవ్వాలని లోకేశ్ సూచించారు.

విరామం

==========

పంచాయతీ ఎన్నికల అనంతరం కూడా గ్రామాల్లో ప్రశాంత పరిస్థితి ఉండే విధంగా ఎన్నికలు సాగాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ సూచించారు. మున్సిపాలిటీ, పరిషత్ ఎన్నికల్లో కూటమి పక్షాలు సాధించిన విజయం స్ఫూర్తిని పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ ఈరోజు మంగళగిరిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కూటమి పక్షాల ఐక్యతకు ఈ ఎన్నికలు ఒక

నిదర్శనంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల సందర్భంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

==========

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కొఠియా వివాదాస్పద గ్రామాలకు చెందిన ఆరుగురు ఆంధ్రప్రదేశ్ గిరిజనులను కొరాపుట్ పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఖండించారు. పార్వతీపురంలో మంత్రి ఈరోజు మాట్లాడుతూ... నిర్బంధించిన వారిని తక్షణమే విడుదల చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడబోదని మంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో నూతనంగా ఎన్నికైన 120 మంది కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. రేపు ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని యథావిధిగా నిర్వహిస్తామన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్, ప్రొసీడింగ్ అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ ఎన్నికైన 120 మంది వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడంతో పాటు.. డిప్యూటీ మేయర్ పరోక్ష ఎన్నికను మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తారని కమిషనర్ వెల్లడించారు.

==========

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కొండ దిగువన ఉన్న వరాహ పుష్కరిణి వద్ద పుణ్య జల హారతులను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉభయ దేవేరులతో గోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ, నాదస్వరాలు, వేదమంత్రాల నడుమ శోభాయాత్ర, శాస్త్రోక్త పూజలను మంగళవారం నిర్వహించనున్నారు. అనంతరం వరాహ పుష్కరిణికి ప్రత్యేక జల హారతులు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పుష్కరిణికి నమస్కరించనున్నారు.

==========

నైరుతి బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ వరకు ద్రోణి విస్తరించినట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశల నుంచి గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి సముద్రాల వెంకట జగన్నాథ్ కుమార్ తెలిపారు. వీటి ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

==========

వెల్లింగ్టన్ లోని న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో భారత్ ఆధిక్యం సాధించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 9 వికెట్ల నష్టానికి 720 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దీంతో న్యూజిలాండ్ పై తొలి ఇన్నింగ్స్‌లో 352 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. విదేశీ గడ్డపై టెస్టుల్లో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం.

==========

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 24వ తేదీన కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా స్వామివారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తరువాత ఈ దీపోత్సవం నిర్వహించనున్నారు.

==========

==========